# వ్యాస కౌముది



## సాహిత్య నమూనాలు


**వెల్చేరు చంద్రశేఖర్**

"నీ చుట్టువున్న లోకంలో నీకు చెందని భావం ఏముంటుంది? ఈ భావాలు. ఈ అనుభవాలు నీ మనస్సుపై వేసిన ముద్రలలో నుండే నీ మాటలు దొర్లుకొనివస్తాయి. నీవు కవివయితే ఆ శబ్దము వ్యంజకమై కావ్యత్వాన్ని పొందుతుంది. కవివయితే నంటే ఏమిటి? కవియైనవాడు లోకాన్ని చూచే దృష్టివేరు వానికి కనిపించే లోకము అందరు చూచే లోకమే"

సాహిత్యం చదవడమే గాని, దానికి ఒక టాగ్ కట్టడం అంటే ఇది సాంప్రదాయం, ఇది అభ్యుదయం, ఇది విప్లవాత్మకం, ఇది దిగంబరం కింద విడదీయడం అంటే, ఏమిటో నాకు తెలియదు. ఇన్నింటిలోనూ ఇది ఆలోచనాత్మకం, నిర్మాణాత్మకం, అని ఎవరూ అనలేదా? లేక ఆ కోవలోకి అన్ని సాహిత్యాలు వస్తాయా? వొకసాహితి సమావేశంలో ఆవంత్స సోమసుందర్ విశ్వనాధని ఒక ప్రేతాత్మ అన్నారు. అది నా మస్తిష్కంలో బాగా ముద్రవేసింది అప్పటికే నేను అలవోకగా విశ్వనాధని చదువుతున్నా ఇష్టపడ్డా కూడా, సోమసుందర్ గారు నాపెళ్ళికి వచ్చారు. అయన నా భార్య తరపు బంధువు ఆయనకి నన్ను పరిచయం చేస్తూ ఈయన అంటూ నాగురించి అయనకి చెప్పి ఆయన గురించి కూడా చెప్పారు, అప్పుడు నేను ఆయనెక్కడ ప్రేతాత్మలని చూడగలరు అన్నా, ఆయన విరసుడు కాదు, అరసుడు, ఆశ్చర్యపోయారు, నా నిర్మొహమాటం ఆయనకి నచ్చింది తర్వాత నాకు చాలా పుస్తకాలు ఇచ్చారు అభిమానం పంచారు కూడా! విశ్వనాధని అయన లాజిక్ ని మెచ్చుకున్న వాళ్లలో వివినమూర్తిగారు వున్నారు.

దృక్పథాలు పక్కకుపెడితే విశ్వనాధ సాహిత్యం ఓ మ్యాజిక్ లేదా మెస్మరిజం. అయన మనస్తత్వ విశ్లేషణ, సంఘటన విశ్లేషణ నన్ను ఆకట్టుకున్నాయి. గంగూలీ ప్రేమకథ చదివితే అర్థం అవుతుంది.

# విశ్వనాథ వారి మళ్లింపు నమూనా-2




" సనాతన ధర్మం రాదు..కానీ, వేద మతానుసరణం తప్పదు..ఆది వినా ప్రపంచ శాంతిఉండదు..ఏ ఇజమూ గట్టెక్కించదు ..వేదిజం ఒక్కటే శరణ్యం.." అని నిష్కర్షగా చెప్పింది, విశ్వనాథ.

కవిరాజు త్రిపురనేని రామస్వామి తన సిన్సియారిటీతో తన సంస్కృతినుండి తిరస్కరించింది ఎక్కువ, స్వీకరించింది తక్కువ (పురాణం), మంచిని గ్రహించడానికి కాక చెడును ఎత్తి చూపించడానికి ఎక్కువగా వాడుకున్నాడు.

అదే తేడా ఇద్దరికీ ! అక్కడే మొదలైంది, పురాణ వైరం (ఇది రామస్వామి చౌదరి పుస్తకాల నుండి వచ్చిన ఆలోచనకి సమాధానం కావచ్చు--- అంటే హేతువాదం, నమ్మకం మధ్య జరిగిన ఘర్షణ) అందుకె పురాణ వైరగ్రంధ మాలలో మొదటి నవలగా, భగవంతునిమీద పగ .....

టూకీగా.., శ్రీకృష్టుడు అర్జునుడు కలిసి సైంధవుడ్ని హతమార్చిరి. శ్రీకృష్ణుని తెలివివల్ల ఆ సైంధవుని శిరస్సు సూర్యునికి అర్ఘ్యం ఇస్తున్న అతని తండ్రి చేతిలో పడుతుంది. అతడతని కొడుకు శిరస్సుగా గుర్తించక క్రిందకి విసిరేస్తాడు. తన శిరస్సు వెయ్యివ్రక్కలవగా మరణిస్తాడు. అందువలన సైంధవులకు శ్రీకృష్ణుడు శత్రువు, అతడు మోసంతోనే ఈ వధ చేయించెను, కానీ శ్రీకృష్ణుడు భగవంతుడు. ఎవరికి? వైదిక మతానుయాయులకు (నమ్మకస్తులకు) ఆ వైదికమతము లేకుండా చేయాలి ఎవరు చేస్తారు.

(కల్పన మొదలు) సైంధవునికి వొక మేనల్లుడున్నాడు. అతని పేరు కనకసింహుడు అతడు కపటి, రాక్షసస్వభావం కలవాడు. సైంధవుడు వున్నన్నాళ్ళూ స్వేచ్ఛగా తిరిగిన కనకసింహుడికి, సైంధవుడి మరణం కోపం తెప్పిస్తుంది. భారతదేశంలో వైదికమతం లేకుండా చేయడం అతని ధ్యేయం దాని కొమ్ముకాస్తున్నరాజుల్ని రాజ్యాల్ని కూలదోయడం, అతని జీవితలక్ష్యంగా చేసుకు, ఒక ప్రతిజ్ఞ పూనాడు. తన కూతురికి దుశ్శల అని పేరుపెట్టాడు. ఆమె భర్తపేరు జయద్రదుడు. జయద్రదుడి కొడుకు పేరు జయద్రదుడనే వుంటుంది. తన కుటుంబంలో వారి జీవితం వైదిక మతనిర్మూలనకే వుపయోగపడుతుంది. వీరికి మ్లేచ్ఛ భావములు ఆలోచనలు వున్నా వైదికమతంలో ఆదుపాదులు అతనికి పూర్తిగా తెలుసు.

మ్లేచ్ఛులలో విద్యలకి వైదికమతములలో విద్యలకి తేడా పారలౌకిక తాత్వికత లేకపోవుటమే! మ్లేచ్ఛలకి రామఠదేశం గురుస్థానం. అది సింధుదేశమునకు పక్కగానున్నది. అక్కడి విద్యలన్నియు యుచ్ఛారణ మీద మాత్రమే ఆధారితములైనవి. ఆమ్లేఛ్ఛల్లో వార్తాంతికులు, ఏ రాజ్యము బలహీనమౌనో, రాజు బలహీనుడో గురువుల బలము, తక్కువో అంచనావేసి మ్లేఛ్ఛరాజుకు చెప్పుదురు. వారా దేశమునకు జయద్రదుని నియోగింతురు.

అందులో రెండవ నవల ......నాస్తిక ధూమము

భయంకరమైన తాడెత్తు చాముండీ విగ్రహం వింధ్యాటవుల్లో వుంది. దాని పక్కగా ఒక వాగు ప్రవహిస్తోంది. చాముండీని వింధ్యగిరి స్వామి కొలుస్తున్నాడు. ఎలా? శరీరాన్ని కొరడాలతో కొట్టుకు వచ్చిన రక్తాన్ని విగ్రహం నాలుకకి పూసాడు, దాంతో చాముండి మహావుగ్రంగా చూస్తూ సంతోషించినట్టే కనిపిస్తోంది. కానీ భయం కొల్పుతోంది. ఆ వింధ్యగిరిస్వామే జయద్రదుడు.

ఆ చాముండీ విగ్రహాన్ని ఆరాధిస్తూ రాజులను బలిచేస్తూ జరాసంధుడు శక్తిని సంపాదించాడు. ఆ శక్తితోనే శ్రీకృష్ణుడ్ని జయించాడు.

జరాసంధుడ్ని శ్రీకృష్ణుడు భీముడిచేత చంపించాడు. జరాసంధుడి కొడుకు సహదేవుడు మహాభరతయుద్ధంలో చనిపోయాడు. అతని కొడుకు సోమాధి. అతడా విగ్రహాన్ని వి0ధ్య అడవుల్లోకి పంపేసాడు. అలా పంపడానికి 22 ఏళ్లు పట్టిందని అందుకే 22 రాజుల తర్వాత జరాసంధుడి వంశం నాశన మౌతుందని, దేవి శాపం అని చెప్పుకుంటారు. ఆ ఇరవైరెండో రాజే, నేటి రిపుంజయుడు, తీవ్ర దేవీవుపాసకుడు ఆ మహారణ్యంలో వున్న వింధ్యావాసినిని బార్హద్రద వంశపు రాజులు వుపాసించారు. వారేకాక బార్హద్రద వంశపురాణులు ఈ దేవీ వుపాసకులు, దేవికి భక్తులే. ప్రతి నవరాత్రికి దేవీదర్శనము చేసి వుత్సవములు చేసిన వాళ్ళే అట్టి పరిస్థితుల్లో రిపుంజయుడు భార్య మహేశ్వరి చండీ వుపాసకురాలు. చాలామంది రాణులకు గురువులు లేరు.

మహేశ్వరికి వింధ్యగిరి స్వామి గురువు.

మహేశ్వరి కాశీవంశంలో పుట్టింది. వెలియోనస్ అనే మ్లేచ్ఛ గురువు దగ్గర మొదట క్షుద్రవిద్య నేర్చింది. మహేశ్వరి చండీవుపాసన రిపుంజయుడికి తండ్రి చెప్తాడు. మహేశ్వరి అటవిక స్వేచ్ఛ ప్రదర్శిస్తుంది. ఆ అటవిక స్వేచ్ఛ రిపుంజయుడ్ని ఆకట్టుకుంటుంది. ఆమెను పెళ్ళాడతాడు. పెళ్ళయిన తర్వాత మహేశ్వరి రాణిగా అంతఃపురంలో వొదిగి వుండదు. మొదట అత్తగారితో వింధ్యవాసిని పూజకు వెళ్ళినా, తర్వాత స్వతంత్రంగా దేవీ వుపాసనకు వెళ్తుంది. అక్కడే వింధ్యగిరి స్వామి కలుస్తాడు.

వింధ్యగిరిస్వామి దేవిని వామాచారములతో అంటే నర,. ఎనుబోతు బలులతో మరీ భయంకరంగా చేస్తాడు. దేవి నాలుకకి రక్తం పూయడంతో దేవి నెత్తురు తాగినట్టుంది. జయద్రదుడు (వి.స్వా.) రిపుంజయుడిచేత దేవి ఆరాధన చేయించి సమస్తభూమండలం ఏలేటట్టు చేస్తానని జరాసంధుని అంతవాడ్ని చేస్తానని, మహేశ్వరికి చెప్తాడు. మహేశ్వరి అతని శిష్యురాలవుతుంది.

అయితే మహేశ్వరిని శిష్యురాలి నించి దాసిని చేసి ఆఖరికి వుంపుడుకత్తెగా చేసుకుంటాడు. ఆమె ఎదిరిస్తే అకారణంగా మహేశ్వరి ఆరోగ్యం చెడడం, అది రాజవైద్యులకి అంతు పట్టకపోడం జరిగేది.

రిపుంజయుడ్ని జరాసందుడంతటి వాడ్ని చేస్తానన్న వింధ్య గిరిస్వామి మాటలు అతనికి ఆశకలిగించాయి. అందుకే మహేశ్వరికీ స్వేచ్ఛ.

అయితే మహేశ్వరికి కూతురు కలగడంతో వింధ్యగిరిస్వామి జీవిత ధ్యేయం దెబ్బతింటుంది. అతను మగధరాజ్యం మీద పట్టు సాధించకలేకపోతాడు. కానీ అతను వెనుకడుగువెయ్యడు. మహేశ్వరి కూతురు తులసిమీద కన్నేస్తాడు(అదే మ్లేచ్ఛ ఆటవిక స్వేచ్ఛ) ఆమెని దేవీ భక్తురాల్ని చెయ్యమని వింధ్యాటవులకి తీసుకురమ్మని మహేశ్వరిని బలవంతపెడ్తాడు.

మహేశ్వరి రెండోసారి మోసపోడానికి వొప్పుకోదు. వింధ్యగిరిస్వామి మహేశ్వరిమీద ప్రయోగించిన క్షుద్రశక్తులన్నీ తులసిమీద ప్రయోగిస్తాడు. కానీ మహేశ్వరి అండగా సాత్విక దేవతావుపాసకుడైన గంగాధరశర్మ అండగా నిలచి వి0ధ్యగిరిస్వామి ప్రయోగాలన్నీ తిరగ్గొడతాడు. తులసిని కాపాడతాడు. తులసికి గురువుగా ఆమెకి బోధచేస్తాడు తులసి సునిశితబుద్ధి కలది.

మహేశ్వరికి కూడా వింధ్యగిరిస్వామి భ్రమతొలగిపోతుంది. ఎదురుతిరగాలనే అనుకుంటుంది. కానీ పరిస్థితి అనుకూలంగాలేదు. రిపుంజయుడు వింధ్యగిరిస్వామి మహేశ్వరికి మధ్యవున్న సంబంధం పసిగట్టేడు. వింధ్యగిరిస్వామి ఆంతర్యం తెలుసుకున్నాడు. మహేశ్వరి పట్ల వికలమనస్కుడై ఎడం పెట్టాడు. అది జరిగి మూడుఏళ్ళు పైగా అయింది.

అలాంటి తరుణం కోసమే ఎదురు చూస్తున్నాడు, ఆ దేశపు మహామంత్రి మునీకుడు.

అయితే మహేశ్వరికి దూరపు బంధువులైన వీతిహోత్రులని తొమ్మిదిమంది అన్నదమ్ముల అండ వుంటుంది. వాళ్ళు మహేశ్వరికి రిపుంజయుడకి సహాయము రావచ్చు. వీతిహోత్రులు పరాక్రమవంతులు సాహసికులు అంతకుమించి

అహంకారులు వారి అహంకారము వుపయోగించుకుని, ఒక పధకం ప్రకారం వీతిహోత్రులని చంపేస్తాడు మునీకుడు. వీతిహోత్రుల హత్యవెనక మునీకుడున్నాడని స్పష్టమౌతుంది.

అది రిపంజయుడకి తెలుస్తుంది. మొత్తం మగధకి తెలుస్తుంది. దానతో మునీకుడుకి ఏదో చెయ్యక తప్పని పరిస్థితి వస్తుంది.

మహేశ్వరికి ఏదో చెయ్యవలసిన పరిస్థితి వస్తుంది. అదే వింధ్యగిరిస్వామి దగ్గరికి ప్రయాణం ఆ ప్రయాణం చెయ్యాలంటే రాజు అనుమతి కావాలి. రాజు అనుమతి కోసం వీరసేనుడనే అంగరక్షకుడ్ని పంపుతుంది.

రాజు ఏ సమాధానం చెప్పడు. కదలడు. మెదలడు ఆజ్ఞ ఇప్పించమని అతని ఎదురుగా పెట్టిన తాటియాకు ఎగిరిపోయినా, అతనిలో చలనం వుండదు. అదే విషయాన్ని మహారాణీ మహేశ్వరికి చెప్తాడు వీరసేనుడు.

మహేశ్వరికి అనుమానం వస్తుంది. ఎవ్వరూ తన రాణితనాన్ని గౌరవించడం లేదు దానికి కారణం తన యందు రాజుకి కల కోపమే కావచ్చు. రాజుతో మాట్లాడడానికి అన్నపూర్ణ అనే వృద్దపరిచారికను పిలిచి పంపుతుంది.

అన్నపూర్ణ రాజుదగ్గరకి వెళ్ళేసరికి అక్కడ మునీకడుంటాడు. అన్నపూర్ణ ఏ సందేశము తీసుకొచ్చిందో తెలుసుకోవాలనుకుంటాడు అక్కడనుండి వెళ్ళిపోతాడు. అన్నపూర్ణ రాజుతో రాణి గురించి అనునయవాక్యాలు చెప్పి రాణి రాజుదర్శనం కోరుతున్నట్టు చెప్తుంది.

రిపుంజయుడు వులకడు పలకడు రెండుకన్నీటిబొట్లు కారుస్తాడు.

అన్నపూర్ణ అక్కడి పరిస్థితి గ్రహించి రాణికి చెప్తుంది రాణి గంధవాహుడనే అంగరక్షకుడితో రాజుదగ్గరికి వస్తుంది. రాజుకి ఏదో దుష్టప్రయోగం జరిగిందని, రాజు పూర్తిగా కదలలేడని ప్రాణాలతో వున్నకట్టె అని అర్ధం చేసుకుంటుంది. అప్పటికే అన్నపూర్ణ ఆదేశం మీద రాజుగదిని బేధిస్తారు. రాజు గదికి రహస్య నేలమాళిగ, కిటికీగుండా రాజుగదిలో జరిగే విషయాలన్నీ మునీకుడికి తెలుస్తాయి.

రహస్య బేధనం జరిగిందని కూడా మునీకుడికి తెలుస్తుంది. మునీకుడు ఆతృతతో రాజుదగ్గరకి వస్తాడు. మునీకుడితో, మునీకుడి అంగరక్షకులు అటవికులు రాజుదగ్గరకి వస్తారు. మునీకుడు తెలివిగా మహేశ్వరి వింధ్యగిరిస్వాములు దుష్టకృత్యాలవల్లే రాజుకీ గతి పట్టిందని అంటాడు. మహేశ్వరి కోపంతో అక్కడనుండి వెళ్ళిపోదామనుకుంటుంది. మునీకుడి అంగరక్షకులు అడ్డుకుంటారు. గంధవాహుడు వారితోయుద్ధం చేసి చంపేస్తాడు.

రాణి దారిని సుగమం చేస్తాడు. రాణి తన అంతఃపురానికి వెళ్ళిపోతుంది. కానీ ఆమె వెనకే మునీకుడు వచ్చి ఆమెని మహేశ్వరీ సంభోదిస్తాడు.

అది విన్న గంధవాహుడు మునీకుడితో యుద్ధం చేస్తాడు. కానీ మునీకుడ్ని చంపడు. మంత్రి, మహాసేనాని పోతే దేశం ఏమైపోతుంది. అని ఆలోచించి అతన్ని నిరాయుదుడ్ని చేస్తాడు.

గంధవాహుడి లాంటి అంగరక్షకుడు రాణి అదృష్టం అంటాడు. మహేశ్వరి కత్తితీసి మునీకుడి గుండెమీద పెట్టి ఆ తర్వాతకూడా నా మర్యాదకేం భంగం లేదు అంటుంది. మునీకుడు ఆశ్చర్యపోతాడు. మునీకుడు గంధవాహుడ్ని చంపే, రాణిని మహేశ్వరి అని సంభోదిస్తానని చెప్పి వెనక్కి వెళ్ళిపోతాడు.

కొంతసేపటికి మునీకుడు రాజుని చూడ్డానికి తక్షణమే రమ్మని మహేశ్వరికి కబురు పెడ్తాడు.

రాజు చచ్చి పోయాడని, రాణి మహేశ్వరి గ్రహిస్తుంది.

రాజు శవం దగ్గరికి వెళుతుంది. మహేశ్వరి మగధరాజ భక్తులైన కొందరు సేనాపతులచేత రాజు పాదాలంటి ప్రయాణం చేయిస్తుంది. ఎట్టిపరిస్తులలోనూ మగధ సామ్రాజ్యం మునీకుడికి దక్కనివ్వనని మగధ సైన్యాధిపతి విశ్వపతి ఆయుధగారం, ధనాగారం, ఆయుధకోశం అన్నీ స్వాధీనం చేసుకొంటాడు. మగధలో సైన్యం రెండుగా చీలిపోతారు. ఒకరు ఆటవిక సైన్యాధ్యక్షులు, మగధసైన్యాధ్యక్షులు సైనికులు రెండుపక్షాలుగా వీడి మగధలో ఏ సమయంలోనైనా యుద్ధానికి సిద్దమవుతారు. జనజీవనం అస్తవ్యస్తమవుతుంది.(సివిల్ వార్)

ఆ సమయంలో పరిస్తితి కనిపెట్టి మునీకుడి కొడుకు ప్రద్యోతనుడు తండ్రిని కలుస్తాడు. తండ్రే కనుక తనని రాజుని చెయ్యాలనే ఆలోచనలో వుంటే, ఇంత కుటిలత్వంతో సంపాదించిన రాజ్యం తనకి వద్దంటాడు.

మునీకుడు రాజు పోయాడు కాబట్టి రాజ్యం పరులబారి పడకుండా కాపాడాలని తను ఈ కట్టుదిట్టం చేసానని రాణి తప్పుగా అర్దం చేసుకున్నది. (THE LAW HAS THE REASON WITHOUT PASSION). ఇప్పుడు విశ్వపతి రాజ్యం కాజేయదని నమ్మకం ఏమిటి అని ఎదురుప్రశ్న వేస్తాడు.

ప్రద్యోతనుఁడు రాణి దగ్గరకివెళ్ళి, మగధ ఇరు సైన్యములతో నిండిపోయింది జన జీవనం అస్తవ్యస్తం అయింది. ఏదో చెయ్యాలి అని అంటాడు

రాణి " ఏం చెయ్యాలి"

"ముందు పరిస్థితి చక్కబరచాలి"

"తర్వాత యేమిచెయ్యాలి " రాణి వ్యంగ్యం

తనకి రాణి కూతురు తులసికి గల సంబంధం రాణికి తెలిసి, వ్యంగ్యంగా మాట్లాడుతున్నదని "తనకి రాజ్యం అఖ్ఖర లేదని పరిస్థితి చక్కబడ్డాక తన కుటుంబంతో మగధని వదిలి పోతానని, లేదా మీ ఆజ్ఞ ఎలా ఉంటే అలా చేస్తానని" హామీ యిస్తాడు..

కానీ రాణినమ్మదు. ప్రద్యోతనుఁడు ఆత్మసమర్పణకి సిద్ధపడతాడు. అప్పటికి రాణికి ప్రద్యోతనుడి నిజాయితీ మీద నమ్మకం కలుగుతుంది. అతడికి అధికారం ఇచ్చి తోడుగా గంధవాహనుడిని పంపుతుంది. మగధ నగరం యుద్ధ వాతావరణం నుండి బయటపడుతుంది.

ఇది జరిగిన రెండో రోజు .... మహాసభ జరిగింది

అందులో విశ్వపతి దోషికాదని నిరూపించబడుతుంది. మునీకుడు దోషి అని నిరూపించబడుతుంది. అతడిని బంధిస్తారు.

అదే సభలో తులసి ప్రద్యోతనుడి మెడలో మాలవేసి "ఇతడే నా రాజు" అంటుంది. ప్రద్యోతనుఁడు రాజు అవుతాడు. ప్రద్యోతన వంశం (సామాన్య శకం పూర్వము (క్రీస్తు శకం గా మనకి పరిచయం) పాశ్చాత్యులు దిద్దుకున్నారు. ఎందుకంటె కేలండర్ మొదట మార్చితో మొదలయ్యేది. తర్వాత రొమన్ సీజర్స్ మార్చి జాన్యువరితో మొదలుపెట్టించారు, అందుకే శకాల్ని సామాన్య శకం గా మార్చారు ) 2130-1996 (సుమారుగా)వరకు.)

అయితే బంధింపబడిన మునీకుడు జైలునుండి తప్పించబడి అడవుల్లో తేలతాడు.

వింధ్యవాసిని దగ్గరకి తులసిని తీసుకురాలేదని. వింధ్యగిరిస్వామి మగధవచ్చి తులసీ మీద దుష్ట ప్రయోగం చేస్తాడు. దాన్ని గంగాధర శర్మ తిప్పికొడతాడు. వింధ్యగిరిస్వామి గాయపడ్తాడు. మహేశ్వరి వింధ్యగిరిస్వామిని హెచ్చరించి పంపేస్తుంది.

ఇది జరిగినకొన్ని రోజులకి గంధవాహనుడిని తీసుకు రాణి మహేశ్వరి వింధ్యవాసిని దగ్గరకు వెళుతుంది. గందవాహకుడికి మునీకుడికి ద్వందయుద్దము జరుగుతుంది. గందవాహుడు మునికుడిని చంపేస్తాడు.

గంధవాహకుడికి వింధ్యగిరిస్వామికి ద్వందయుద్దము జరుగుతుంది. వింధ్య గిరిస్వామి కత్తియుద్ధపు తీరుకి అతని నేర్పుకి గంధవాహుడు మహేశ్వరీ ఆశ్చర్య పోతారు.

వింధ్యగిరిస్వామి గంధవాహనుడిని చంపేసి, తనను ఎదిరించిన మహేశ్వరిని కూడా చంపేస్తాడు. తన కోరిక నెరవేరి రాజు మారాడు, కానీ తన కోరిక నెరవేరలేదు. కొత్తరాజు తన ఆధీనంలో లేడు, తాను ఈ దేహంతో కృష్ణుని అస్తిత్వం మీదపగ తీర్చుకోలేనని, ధూమమై సర్వం వ్యాపిస్తానని, చితిపేర్చి మంటల్లోకి దూకేస్తాడు, వింధ్యగిరిస్వామి అతడే జయద్రధుడు.

అద్భుతంగా రాసిన నవల. కొందరు జేమ్స్ జాయిస్ ని చదువుతారు. విశ్వనాధని కాదు. ఎందుకు. ఇద్దరి రచనల్లో మాజికల్ రియలిజం వుంది మరి.

ఏదో జానపద సినిమాలా వుండొచ్చు, కానీ ఇందులో కొన్ని మర్యాదలు పాటించబడ్డాయి అవి ఈ దేశం లో ఎందుకు అన్న ప్రశ్న లేకుండా చలామణి అవుతున్నాయి.

దేవుడు లేడు. అన్నవాళ్ళందరూ దేవుని వితంతువులా? ఇలాంటి లాజిక్ తో కొందరు అనేక తికమకలు పెట్టారు.

ఇక్కడ వింధ్యగిరి స్వామీ ఒక వైపు. గంధవాహుడు మరోవైపు కధలో పెరిగిన తీరు. ఒకేలా వుండవు. గంధవాహుడు కొన్ని మర్యాదలకి లోబడి (ఉదాహరణ మంత్రిని ఎదిరించి సంహరించ గలిగి ఉండి, నిలువరిస్తాడే తప్ప మంత్రి లేకపోతె దేశం ఏమైపోతుందన్న స్వతంత్ర ఆలోచన చేసి ప్రతిఘటిస్తాడే తప్ప సంహరించడు.) వికాశం చెందుతాడు. ఆలోచనలో విశృంఖలత ఉండదు. వింధ్యగిరి స్వామీ అలా ఉండదు ఆలోచనలు ఏ మర్యాదకి పరిధులకి లోబడి వుండవు. మహేశ్వరీ తల్లి తనకోర్కె తీర్చకపోతే కూతురు తులసి ని తన కోర్కెకు బలిచేద్దామనే విపరీత మ్లేచ్ఛ ఆలోచనతో ఉంటాడు. ఇక మంత్రి రాణిని అవమానించడానికే వెనుతియ్యడు. విశృ0ఖలత్వం కనిపిస్తుంది. మహత్వాకాంక్ష కొడుకుని రాజు చెయ్యాలి. అధికారం చేత సామర్ధ్యం, కానీ గంధవాహుడు సామర్ధ్యం వున్నా అధికారానికి గౌరవం ఇచ్చాడు. పంచమాతలలో ఒకరైన రాజపత్నికి గౌరవం ఇచ్చాడు. వినయంగా ప్రవర్తిస్తూ గొప్పవాడైయ్యాడు. ఇవన్నీ ఈ దేశంలో మర్యాదలు గుణాత్మక వ్యక్తిత్వాలుగా చెప్పబడినవి. అవన్నీ పక్కకు పెట్టి, వాటిని ప్రశ్నించడం, వాటిని మూఢ నమ్మకాలనడం, అదే వ్యక్తి వికాశం అని, మహత్వాకాంక్ష, శరీర వాంఛలు ముఖ్యమై, కథలై, సాహిత్యమై, కూర్చున్నాయి. బుద్ధికొలత వాదం, అసాధారణ అనుభవం? భౌతిక వాదులు బుద్ధికి ఇవ్వవలసిన ప్రాముఖ్యత ఇవ్వలేదు. అంటూ కొందరు వాపోయినా, వారిని పట్టించుకోకుండా కొందరు తమ వామ ప్రచారం కొనసాగించారు. కానీ అది ప్రచార స్థాయిలోనే చతికిలబడింది.

పునర్జన్మ–విశ్వనాధవారి నవల. పునర్జన్మ అనేది హిందువుల బలమైన నమ్మకం, ఏదైనా తేడా వచ్చినప్పుడు, ఎవరికైనా ధర్మ అర్ధ కామ మోక్షాలలో (నిర్మించబడ్డ హైందవ తత్వ జ్ఞానంలో) అది వాడి పూర్వజన్మ సుకృతమో దుష్కృతమో అని తేల్చేస్తారు, అంతేగాని వర్గ విభజన అనో మరొకటనో ఘర్షణాత్మకమైన దారికి పోనివ్వరు. ఘర్షణ వలన అశాంతి తప్పదు.

విశ్వనాధ రచనలన్నీ 1960–70 లో వచ్చాయి. (ఆత్మ విషయం పతంజలి యోగసూత్రాలలో వుంది అంటారాయన) 1996 లో x–ఫైల్స్ అంటూ వో చిన్న సీరియల్ వచ్చింది. అందులో ఈ –ఎపిసోడ్ పేరు (BORN-AGAIN). అందులోవాడిన సాంకేతిక పదాల వివరణ ఈ నవలకి సంబంధిచిన సంఘటనలతో పోలిన పేరాసైకిక్ టెర్మినలోజీ , నేను బ్రాకెట్సు లో చెప్పాను

జానకి పూర్వజన్మలో ముప్ఫైఏళ్ళకే చనిపోతుంది ఆమెకి ముగ్గురు పిల్లలుంటారు. ఆమె మళ్ళీ పుడుతుంది. ఈ వయసులో తన భర్తా పిల్లల దగ్గరకి వెళుతుంది. (Transmigration) అక్కడ తన పిల్లల్ని మోటివేట్ చేస్తుంది (Psychokinesisis usually accounted with electric charge.) అందర్నీ ఆశ్చర్య పరుస్తుంది. అందులో పెద్దకొడుకు పతంజలి యోగసూత్రాలు తెలిసినవాడు, తన తల్లిని వొప్పుకుంటాడు. రెండోవాడు వోప్పుకోడం ఇంకోలా వుంటుంది జీవులు పునర్జన్మ ఎత్తితే మరి తద్దినాలు ఎందుకు? అని చనిపోయిన తల్లికి తద్దినం పెట్టడు.( re-embodiment) ఈ జన్మలో కూడా అదే వయసుకి చనిపోతుంది. (Psychically project her own will.). నవల మంచి ఆసక్తి కరంగా సాగుతుంది.

ఈ నవలని అపహాస్యం చేస్తూ ఇది ముసిలివాళ్ల కోసం రాసిన శృంగార నవల అన్నారు. అంతేకాదు ("స్త్రీ పురుష సంగమ ప్రక్రియలో చిత్తవృత్తికి ప్రాముఖ్యం లేదు అంటూనే తత్సంబంధమైన ఏకాగ్రత సిద్దిస్తే అది ముక్తికి మార్గం అవుతుంది" అంటూ విశ్వనాధ చిత్రించారు, అంటూ అపహాస్యపు విసురు వినిపించింది. రచయిత రచనలన్నీ ఆత్మాశ్రయాలే....అంటూ ముగింపు.)

సృష్టి ఒకేలా ఉండదని దాని వైవిధ్యాలు దానికి వుంటాయని ఆ వైవిధ్యాలు తెలిసి సమతుల్యం ఏర్పరచుకుంటే జీవితం సజావుగా ఉంటుందని తెలుసుకు సాహిత్యం మొదలు పెట్టిన రచయిత విశ్వనాథ. అందుకే ఆయన పునర్జన్మ నవల రాసేరు అనిపించింది. అది ఏ నమ్మకానికి పునరుద్ధరణో తేలికగా అర్ధం అవుతుంది.

కొన్ని మూఢ ఆచారాలు, సంస్కరించబడుతున్నకొద్దీ చట్టం మరుగున పడుతుంది. న్యాయం కలుగచేసుకు చెప్ప వలసిన అవసరం ఉండదు.(సతీసహగమనం, బాల్య వివాహాలు వితంతు వివాహాలు.) కానీ దేశంలో సాంస్కృతిక పునాది

ఏర్పడి, దాని ప్రాతిపదికగా దానికి అనుగుణంగా రాజకీయ సామాజిక సాంస్కృతిక వ్యవస్థలు ఏర్పడాలి. అన్నదే ఆయన ఆలోచన, అదే ఆయన మాటల్లో "అభ్యుదయం విప్లవం ఇవన్నీ మానవ అభ్యుదయం ముందు, మిణుగురు చమక్కులే, ఏ దేశమైనా సామాజిక ఆర్థిక రాజకీయ ధార్మిక పరిపూర్ణ ప్రక్రియ మాత్రమే! వాటిని విడివిడి గా చూడలేం"

ఆయన కోలోనియల్ చదువు సంస్కారం నిరసిస్తూ "మనకి స్వరాజ్యం వచ్చిన తర్వాత దేశంలో పదిమంది ఏల్లా సుఖంగా బతుకుతారు. అన్న విచారణ మనం చేసుకోవాలి గాని, సూత్రాల ప్రకారం చేస్తే ఇంకా స్వరాజ్యం ఏమిటి (దమయంతి స్వయంవరం 1958) అని అన్నారు. కానీ ఇప్పటికి అది తెలుగు వాడి బుర్రకెక్కలేదు. చాలా మంది కోలోనియల్ మత్తులో జోగుతున్నారు. అది ఆయన విఫల ప్రయత్నం.

వైవిధ్యంలో కదా మన గొప్పదనము బైటకి వచ్చేది. హైందవ ఆలోచన అనగానే కులాలు ధళితులు జాతులు స్త్రీలు. అనేక వాటిమీద వొకవిచిత్రమైన చట్రపు ఆలోచన. అవి భేదించడమే మార్పు, కొత్తదనం. పరిధుల్ని చెరిపివేయడం విప్లవం, అనే పిడివాదం? ఇవికావు వైవిధ్యాలు అంటే! పరిధుల భౌద్ధికత దానితో విచిత్రమైన లాజిక్ బయలుదేరింది. రెండు సంస్కారాలు లేదా సంప్రదాయాల జోడు పెళ్ళి అయితే, నా సంస్కారం నువ్వు అంగీకరించనప్పుడు, నీ సంస్కారం నేనెందుకు అంగీకరించాలి అనే ప్రశ్న ఘర్షణ కి తప్ప ఎందుకూ పనికి రాదు! ఈ జగన్నాటకంలో ఎవరి పాత్రా ఎవరికీ నచ్చలేదు. కోలోనియల్ బౌద్ధికులు పరిధి ఏర్పరుచుకుని, అందులో మగ్గిపోతున్నారు. కుత్రిమ పరిధి చెరిగి పోడం నచ్చలేదు. ఎందుకు? ఆ పరిధిలో వాడికో గొప్పతనం వుంది కాబట్టి లేదా తెలివిగా ఆ పరిధికి వాడే అధిపతి కాబట్టి.




ఆలోచనలో ఔన్నత్యం ఎంత అశాంతిని రూపుమాపేదో? కానీ అది జరగలేదు. ఇప్పటికీ ఆ కుత్రిమబౌద్ధికతదే లేదా అదే ఆలోచనా వ్యవస్థదే ఆధిపత్యం కాదనడానికి లేదు.

ఈ బౌద్ధికులు రెండు రకాలు, విద్యా రెండు రకాలే, ఒకటి వృత్తి విద్య, ఇది పారంపరికగా వస్తోంది. రెండు జ్ఞాన విద్య, ఇది సంస్కారం ఇచ్చేది. (ఇక్కడో విషయం ఏ ప్రదేశానికి ఆ సంస్కారం ఉంటుంది. ఒక పద్ధతి మర్యాదా ఉంటుంది)

ఆంగ్లేయులు వచ్చిన తర్వాత ఆంగ్లభాష తెలిసికొనుట జ్ఞానము విద్య అయి కూర్చున్నాయి. ఇది తెలుసుకున్న కళాకారులు ముఖ్యంగా రచయితలు, ఆగ్లంలొ వున్న సాహిత్యం దిగుమతి చేసుకు మన సాహిత్యంలో ఇది పనికి రాదు, ఇది బూర్జువా, ఇది అభ్యుదయ ఆలోచన, అనే కోలోనియల్ ముసుగులో మూర్ఛపోయారు ( అందుకే పునర్జన్మ లో సెక్స్ కనబడినంతగా, ఈ దేశపు నమ్మకం తాత్వికత దృష్టి విమర్శింప బడలేదు)

దాని నుండి బైట పడెయ్యడానికి విశ్వనాధ ఎంచుకున్న శిల్పం, సాహితీప్రక్రియ, మాజికల్ రియలిజం లేదా అద్భుతరసం, ఈయన సాహితీప్రక్రియలో హిందూ సమాజంలో (ఆసేతు హిమాచలం) కొన్ని మర్యాదలు వున్నాయి, అవి కొన్ని సాంస్కృతికం, సామాజికం, కొన్ని పారంపరికం. ప్రజలు తప్పులు ఒప్పులు ఎంచకుండా, ఏందుకు? అని ప్రశ్నించకుండా పాటిస్తున్నారు అవి మార్చాలి ఎందుకు? అవసరమా? యుగ ధర్మం అనుకాని కాలధర్మం అది. ఇన్ని భౌతిక దాడుల నేపథ్యంలో--- హైందవ తాత్వికత ఆలోచన సాంప్రదాయ ఉన్నతిని కోరుతూ రచన సాగించారు. బాష ఖటినం, పాత్రలు సజీవం

. ఈయన మళ్ళిన దారిలో కొన్ని భావాలు, ఈనాటికి ఆలోచింపచేస్తాయి. ఇంజీనిరింగ్ చదువుమీద, గ్రామ వ్యవస్థమీద, ఇంగ్లిష్ చదువు మీద, ఆయన చేసిన వ్యాఖ్యలు, కొన్ని

"అతనికి తెలుగుభాషలోని అంత చొరవ ఏమి? లెక్కలు మనసునకు పట్టకపోవుటయేమి? ఇట్లుండుటకు వాని ప్రకృతిలోని రహస్యమేమీ? ఆ రహస్యము తెలుసుకుని దానికి తగిన చదువు చెప్పరాదా?" (పరీక్ష -1949-50) ఈ విషయం ఆనాడు విద్యార్ధులకి చేరలేదు. ఎందుకంటె కోలోనియల్ మైండ్ సెట్ తో వున్న రాజ్యాంగ వ్యవస్థ! ఇది 70 ఏళ్ల క్రిందట మళ్లాల్సిన దారి. ఇప్పుడు అలాంటి ఆలోచనలు ఇంజీనిరింగ్ చదువులో, విమర్శలు, వినవస్తున్నాయి.

స్వయం పోషక శక్తి కలిగిన గ్రామ వ్యవస్థ గురించి, (వేయిపడగలు) ఆంగ్లేయుల కుత్రిమ చట్టాలవలన వచ్చిన మార్పు, ఇవన్నీ చెప్పడానికి వ్యంగ్యం కన్నా పూర్వ అలంకారికుల దారిన పోయి సాంకేతిక పద్ధతిని ఎన్నుకుని చెప్పడం ఈ రచనల గొప్పదనం.

నందోరాజా భవిష్యతిలో, నందుడు ముందు ఎవరు శత్రువులో గ్రహించాలి? వారిని తొలగించడానికి, జాతిని జాగృతం చెయ్యాలి అంటాడు.

"ఈ దేశము ఆధ్యాత్మిక దేశము. దైవము విశ్వసించెడి దేశము. ఆధ్యాత్మిక ప్రవృత్తియు, స్త్రీ పురుష మధ్యగత నీతియు, దైవభక్తి కలిగిన కమ్యూనిజము (మతం మత్తుమందు కాదు) రావలయును ఇది నా కోరిక" అన్నారాయన

కానీ అది జరగలేదు, సంస్కరణోద్యమాలు దేశీయ దైవత్వ విశ్వాసాల్ని(మతం మత్తుమందు అన్న పానీయాల మత్తులో జోగుతున్నాయి) తృణీకరించాయి. ఆ దైవత్వ విశ్వాసంతో ముడిపడ్డ దేశీయ కళలన్ని మరుగున పడ్డాయి. మనలని విఫలులుగా నిలబెట్టాయి.

నా జాతి పూర్వ ప్రధాజీవ రహితమై

శక్తి నాడుల యందు చచ్చిపోయి

నా మాతృభాష నా దుష్ట భాషల

ఔద్ధత్యమ్ము తల నవధరించి

నా తల్లి నేల దౌ నాటి ఆచారముల్

పై మెఱుంగులు చూసి భ్రమసిపోయి

ఏమి మిగిలినది ఈ నాటి కిట్లు

అని 50 ఏళ్ళ క్రితమే వాపోయారు ఆయన ఆంధ్రుల విఫలత్వాన్ని సఫలంగా ఎత్తిచూపినట్లే!

అంటే ఆనాటి ఆయన నమూనా అప్పుడు విఫలమైనట్లే! కానీ ఇప్పుడు?



